క్లుప్తంగా

విద్యుత్ ఉద్యమ అమరులకు నివాళి



చీడిగలో బషీర్‌బాగ్ అమరులకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కాకినాడ రూరల్: పాతికేళ్ల క్రితం విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమంలో జరిగిన పోలీసు కాల్పుల్లో అమరులకు చీడిగ గ్రామంలోని విద్యుత్ కార్యాలయం వద్ద సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం నివాళులర్పించారు. బషీర్‌బాగ్‌లో అమరులు రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామికి శ్రద్ధాంజలి ఘటించి, వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. అనంతరం సీపీఎం నాయకులు పెద్దింశెట్టి రామకృష్ణ తదితరులు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, అజయ్‌కుమార్, సూర్యం, చంద్రరావు, సుబ్రహ్మణ్యం, రాజా, నాగదేవి, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా వలంటీర్లకు నేడు శిక్షణ

కరప: మండలంలో నూరు శాతం అక్షరాస్యత సాధించేందుకు 190 మంది విద్యా వలంటీర్లను నియమించినట్టు ఎంపీడీఓ ఎం.అనుపమ గురువారం తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, వెలుగు విభాగాల ద్వారా నియమించిన విద్యా వలంటీర్లను రెండు బ్యాచ్‌లుగా విభజించి, రెండు రోజుల శిక్షణా తరగతులు ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో బ్యాచ్‌కు 95 మంది వలంటీర్లకు ఒకరోజు శిక్షణ ఉంటుందన్నారు. వయోజన విద్యా శాఖ అందించిన మెటీరియల్ ద్వారా ఉల్లాస్(అక్షరాంధ్ర) శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తారన్నారు. శిక్షణ పొందిన వలంటీర్లు తమ పరిధిలోని నిరక్షరాస్యులను గుర్తించి, వారికి విద్యనందిస్తారని తెలిపారు.

నిరంతర శ్రమతోనే లక్ష్య సాధన



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ బాలకృష్ణ

బాలాజీచెరువు: విద్యార్థి దశలో లక్ష్య సాధనకు అహర్నిశలు శ్రమించాలని లయన్స్ క్లబ్ జిల్లా పూర్వ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ అన్నారు. స్థానిక సంజీవని డిగ్రీ కళాశాలలో బీబీఏ విద్యార్థులకు గురువారం వ్యక్తిత్వ వికాస సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ, లక్ష్యాన్ని ఏర్పరచుకుని, దాన్ని సాధించాలని, అప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగవచ్చన్నారు. విద్యార్థి దశలో పెడదోవ పట్టకుండా, లక్ష్య సాధన వైపే నిరంతర ఆలోచన ఉండాలన్నారు. క్రమశిక్షణ, సమయ పాలనపై మైండ్ ట్రీ సీఈఓ సైకాలజిస్ట్ నాగ్రేందకుమార్ వివరించారు. లయన్స్ క్లబ్ సఖీ అధ్యక్షురాలు దార సునీత, రీజనల్ చైర్మన్ దేవతా పుత్రరావు, కార్యదర్శి సావిత్రి, కోశాధికారి రమణి పాల్గొన్నారు.

జాతీయ యోగా పోటీలకు కాకినాడ క్రీడాకారులు



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న నిర్వాహకులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): పెంటపాడు మండలం ప్రత్తిపాడులో ఈ నెల 21 నుంచి నాలుగు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో కాకినాడకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబర్చారని రాక్ యోగా అకాడమీ నిర్వాహకులు ప్రసాద్ గురువారం తెలిపారు. అకాడమీలో శిక్షణ పొందుతున్న పి.కృష్ణ అంజి, కె.వెంకటేష్ బంగారు పతకాలు సాధించారన్నారు. విజేతలను ఏపీ యోగా పీఠం రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిబాబు, ఎంఎస్ఎన్ స్కూల్ హెచ్ఎం సుబ్రహ్మణ్యం, యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సర్వారాయుడు, లోవరాజు, రాధిక జైన్, కల్పన అభినందించారు.

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా రవికిరణ్



బోట్‌క్లబ్: బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా పెద్దిరెడ్డి రవికిరణ్ నియమితులయ్యారు. గతంలో పార్టీ నగర అధ్యక్షుడిగా, రాష్ట్ర అధికార ప్రతినిధితో పాటు, పలు పదవులు సమర్థంగా నిర్వహించడంతో ఈ పదవి ఇచ్చినట్టు గురువారం ఆయన విలేకర్లకు తెలిపారు.

వీరి ఆటే.. సెపరేటు

- రూ.వేలల్లో ప్రవేశ రుసుం, నెలవారీ ఫీజులు అదనం
- ఆటలకు దూరమవుతున్న పేద క్రీడాకారులు
- అభివృద్ధికి ఆమడ దూరంలో డీఎస్ఏ క్రీడా మైదానం
- నేడు జాతీయ క్రీడా దినోత్సవం



కాకినాడ డీఎస్ఏ మైదానం ముఖద్వారం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): క్రీడాభివృద్ధికి పెద్ద పీట వేస్తామన్న ప్రభుత్వం, ఫీజులు భారీగా పెంచడాన్ని క్రీడాకారులు, క్రీడాభిమానుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తమ పిల్లలను క్రీడా శిక్షణకు పంపాలంటేనే భయపడేంతగా ఫీజులు పెంచడంపై తల్లిదండ్రులు పెదవి విరుస్తున్నారు. తొలుత పే అండ్ ప్లే విధానం తీసుకువచ్చి.. కొద్దిపాటి వసూళ్లతో ప్రారంభించిన శాప్ ఇప్పుడు క్రమేపీ నెలవారీ శిక్షణకు అధిక మొత్తంతో ఫీజులు వసూలు చేస్తుండడంతో పేద క్రీడాకారులు ఆటలకు దూరమవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు ఇవేమీ పట్టించుకోకుండా సొమ్ము ఉంటేనే ఆటలు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఔత్సాహిక క్రీడాకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కథనం.

అధికారులకు స్పష్టత కరవు

కాకినాడ క్రీడా మైదానంలో వివిధ క్రీడలకు అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేయడంతో నగరంలో క్రీడల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. క్రీడా మైదానంలో హాకీ, ఫుట్‌బాల్, జూడో, రెజ్లింగ్, టెన్నిస్, స్క్వాష్, బ్యాడ్మింటన్, స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్, క్రికెట్, యోగా, ఖోఖో, కబడ్డీ, బాస్కెట్‌బాల్ తదితర క్రీడాంశాల మైదానాలు, కోర్టులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 14 ఏళ్ల లోపు బాలబాలికలకు శిక్షణ అందిస్తారు. క్రీడా మైదానంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారుల వివరాలు క్రీడాభివృద్ధి కార్యాలయంలో నమోదు చేయకపోవడం, శిక్షణ అందించే కోచ్‌ల వద్దే జాబితా ఉండడం, క్యూఆర్ కోడ్ ద్వారా నెలవారీ ఫీజులు జమ చేయడంతో డీఎస్ఏకు ఎంత వస్తుందనే దానిపై క్రీడాభివృద్ధి అధికారులకు స్పష్టత లేదు. దీంతో కొన్ని క్రీడలకు రూ.500 నుంచి రూ.3 వేల వరకూ నెలవారీ ఫీజులుగా అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కానరాని చిత్తశుద్ధి

క్రీడలకు పెద్దపీట వేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం.. డీఎస్ఏలోని డార్మెటరీ భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో క్రీడలపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అవగతమవుతోందని క్రీడాభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అథ్లెటిక్స్, టేబుల్ టెన్నిస్, యోగా, తైక్వాండో, ఖోఖో, కబడ్డీ, టెన్నిస్, ఫుట్‌బాల్, క్రికెట్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ క్రీడలకు శాప్ కోచ్ లేరు. వీరి స్థానంలో సీనియర్స్ క్రీడాకారులతో శిక్షణ ఇస్తున్నారు. వీరు ఆశించిన స్థాయిలో శిక్షణ అందించడం లేదు. రెగ్యులర్ కోచ్‌లు అందించినట్టుగా శిక్షణ లేకపోవడంతో క్రీడాకారుల సంఖ్య రోజురోజుకూ క్షీణిస్తోంది. మరోవైపు డీఎస్ఏలో డీఎస్‌డీఓ అనుమతితో కొందరు ప్రైవేట్ కోచ్‌లు శిక్షణా కార్యకలాపాలు అనధికారికంగా నిర్వహిస్తున్నారని క్రీడాసంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. వీరు అనధికారికంగా అధిక మొత్తంతో సొమ్ము వసూలు చేస్తూ.. క్రీడాకారుల జేబులు ఖాళీ చేస్తున్నారని అంటున్నారు. దీనిని అరికట్టాల్సిన డీఎస్ఏ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరించడం కొసమెరుపు.

శాప్ కోచ్‌లు లేకపోవడం వాస్తవమే..



క్రీడా మైదానంలో కొన్ని క్రీడలకు శాప్ కోచ్‌లు లేకపోవడం వాస్తవమే. గతంలో పే అండ్ ప్లే విధానంలో కోచ్‌ల నియామకం చేసుకునే వారు. ఇప్పుడు ఆ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. త్వరలో శాప్ కోచ్‌ల నియామకానికి నోటిఫికేషన్ రానుంది. కొత్త కోచ్‌లు వచ్చే అవకాశం ఉంది.

– బి.శ్రీనివాస్‌కుమార్ డీఎస్‌డీఓ

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జికి సత్కారం



లీలా శ్యామ్‌సుందరిని సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

కాకినాడ లీగల్: కాకినాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎల్.లీలా శ్యామ్‌సుందరిని ప్రకాశం జిల్లా సింగరాయకొండకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సంఘ సభ్యులు గురువారం జడ్జి చాంబర్‌లో ఆమెను దుశ్శాలువా, మెమెంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి చెక్కపల్లి వీరభద్రరావు, ఉపాధ్యక్షుడు పెన్మెత్స రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

బోట్‌క్లబ్: నగరంలోని సాంబమూర్తినగర్‌కు చెందిన టి.పళ్లంరాజు దీర్ఘకాలిక వ్యాధితో గత నెల మూడున మృతి చెందారు. దీంతో అతని కుటుంబం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ ఆ కుటుంబానికి రెండు నెలల నిత్యావసర సరకులు గురువారం అందించారు.

పింఛన్ల పంపిణీ నుంచి తప్పించాలి

- ఎంపీడీవోకు అంగన్‌వాడీల వినతి



ఎంపీడీఓ అనుపమకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

కరప: నెలవారీ పింఛన్ల పంపిణీ నుంచి తమను తప్పించాలని కోరుతూ గురువారం మండల అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు ఎంపీడీఓ ఎం.అనుపమకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ, పింఛన్ల పంపిణీ చేసేందుకు ప్రతి నెలా రెండు రోజులు అంగన్‌వాడీ కేంద్రాలను మూసివేయాల్సి వస్తోందన్నారు. దీంతో చిన్నారులకు, గర్భిణుకు, బాలింతలకు పోషకాహారం అందించలేకపోతున్నామన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు, మహిళల నుంచి విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మండలాల్లో ఎంపీడీఓలకు వినతి పత్రం ఇస్తున్నా పట్టించుకోకపోవడంతో గుంటూరులోని ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్‌ను ఆశ్రయించినట్టు చెప్పారు. ఆ శాఖ డైరెక్టర్ ఎ.సూర్యకుమారి స్పందించి, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లను పింఛన్ల పంపిణీ విధుల నుంచి తప్పించాలని రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు సర్క్యులర్ పంపించినట్టు తెలిపారు. ఆ సర్క్యులర్‌ను ఎంపీడీఓకు ఇచ్చినట్టు చెప్పారు. అంగన్‌వాడీల ప్రతినిధులు వరలక్ష్మి, కల్పలత, మనోజ, భవాని, దేవి, హైమావతి, జ్యోతి, లక్ష్మి, సాయి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరి



గాత్ర కచేరి చేస్తున్న సంగీత విద్వాంసుడు నిరంజన్ దిందోడి

బోట్‌క్లబ్: శ్రీరామసమాజం 131వ గణపతి సంగీత హరికథా మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్థానిక సూర్యకళా మందిరంలో చెన్నైకు చెందిన సంగీత విద్వాంసుడు నిరంజన్ దిందోడి గాత్ర కచేరి అలరించింది. కాంభోజి రాగంలో ఓ రంగసాయి, రామదాసు, అన్నమయ్య కృతులు ఆలపించారు. జ్ఞానదేవ్, నిక్షిత్ వాయిద్య సహకారం అందించారు. కాగా భరతలక్ష్మి, కనుమూరి రాజ్యలక్ష్మి, డి.విజయలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమం ప్రారంభించారు.

బాలల హక్కులపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయ

కాకినాడ క్రైం: బాలల హక్కులే భవితకు మెట్లని జిల్లా బాలల సంరక్షణ అధికారి జాగరపు విజయ అన్నారు. స్థానిక రామ్‌నగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం బేటీ బచావో-బేటీ పఢావో కార్యక్రమం జరిగింది. డీసీపీవో చదలవాడ వెంకట్రావు పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు. బాలలు హక్కులను తెలుసుకోవడం ద్వారా నిర్భయంగా జీవించడంతో పాటు, భవితకు బంగారు బాటలు వేసుకోగలుగుతారని విజయ అన్నారు. అత్యవసర స్థితిలో బాలలు 1098 టోల్ ఫ్రీ నంబరుకు తమ సమస్యను తెలపాలన్నారు. బాల్య వివాహాలకు కనీసం రెండేళ్ల జైలు, భారీ జరిమానా తప్పదన్నారు.

సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకం



వీసీ ప్రసాద్‌ను సత్కరిస్తున్న ప్రతినిధులు

బాలాజీచెరువు (కాకినాడ): మెరుగైన సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని జేఎన్‌టీయూకే వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ పేర్కొన్నారు. పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం దేశనిర్మాణంలో యువ ఓటర్ల పాత్ర, ప్రజాస్వామ్యంలో సమాజం, రాజ్యాంగ సవాళ్లపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ప్రసాద్ యువతకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. క్రియాత్మక సమాజాన్ని సృష్టించడానికి యువత క్రియాశీలత, ప్రాముఖ్యమన్నారు. రాజకీయ శాస్త్ర విభాగ విద్యార్థులకు ప్రజాస్వామ్యంలో ప్రస్తుత సవాళ్లను ప్రతిబింబించే అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ, లఘుచిత్రాలపై పోటీలు నిర్వహించారు. అనంతరం వీసీ ప్రసాద్‌ను సత్కరించారు. యూనివర్సిటీ ఆఫ్ డెమాక్రసీ ఫౌండేషన్ చైర్మన్ అబ్బయ్య, కార్యదర్శి శ్రీనివాస్, ఐక్యూఏసీ డైరెక్టర్ పసుపులేటి హరిరామప్రసాద్, పొలిటికల్ సైన్స్‌హెడ్ హరికిషన్, అర్థశాస్త్ర విభాగాధిపతి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కన్నబాబుకు ఎంపీ, ముఖ్య నేతల పరామర్శ



సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తనూజరాణి, అనంతబాబు తదితరులు

కాకినాడ రూరల్: పితృ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబును అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజరాణి, పలువురు ముఖ్య నేతలు గురువారం పరామర్శించారు. కాకినాడ వైద్యనగర్ నివాసంలోని కన్నబాబును పరామర్శించిన నేతలు.. ఆయన తండ్రి సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి కన్నబాబుకు అండగా నిలిచిన ఆయన తండ్రి సత్యనారాయణ మృతి బాధకరమని, ఆయన కుటుంబం త్వరగా కోలుకోవాలని ఎంపీ తనూజరాణి సహా, నేతలు ఆకాంక్షించారు. ఎంపీతో పాటు, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, అనంత ఉదయ్‌భాస్కర్, అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ, శెట్టి వినయ్, పార్టీ అరకు పార్లమెంటరీ పరిధిలోని నేతలు పరామర్శించారు. ఇంకా కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, జ్యోతుల చంటిబాబు, పార్టీ ప్రత్తిపాడు కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు, కర్రి పాపారాయుడు, రాజమండ్రికి చెందిన మేడపాటి షర్మిలారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి తెన్నేటి కిశోర్, సీనియర్ నాయకుడు కుంచే రమణారావు, పడమట రాజశేఖర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

విశాఖ నేతల పరామర్శ

ఇలాఉండగా మాజీ మంత్రి కురసాల కన్నబాబును విశాఖ నేతలు గురువారం పరామర్శించారు. కాకినాడ వైద్యనగర్ నివాసంలో పార్టీ విశాఖ తూర్పు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ మొల్లి అప్పారావు, జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్ తదితరులు కన్నబాబును పరామర్శించి, ఆయన తండ్రి సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ విశాఖ జిల్లా నాయకులు బోణి శివరామకృష్ణ, దేవరకొండ మార్కండేయులు, బొండా ఉమామహేశ్వరరావు, అక్కరమాని మంగరాజు, పీతల గోవింద్, కనకరాజు, హేమంత్, వెంకట్, రవి, నాగేశ్వరరావు, ప్రదీప్, నీలారెడ్డి, కల్యాణ్, కుమార్‌రెడ్డి, రమణారెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా కొలువైన గణనాథుడు


- వివిధ రూపాల్లో వినాయకుడు
- సందడిగా మారిన నగరం




టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో వినాయకుడి మట్టి విగ్రహం



కరప పాత వినాయక వీధిలో గణపతి స్వామితో బాలభక్త బృందం



కరప కొత్తపేట వీధిలో కరెన్సీతో అలంకరించిన వక్రతుండుడు



దిగుమర్తి వారి వీధిలో గాజులతో తయారు చేసిన వినాయకుడు



జగన్నాథపురంలో జెమ్స్‌తో రూపొందించిన గణపతి

బోట్‌క్లబ్: చవితి ఉత్సవాల సందర్భంగా గణనాథుడికి నగర ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలో వాడవాడలా మంటపాలు ఏర్పాటు చేసి వివిధ రూపాల్లో గణనాథుడిని నెలకొల్పారు. నగరంలో ఏ వీధి చూసినా సందడి కనిపించింది. పలు ప్రాంతాల్లో పర్యావరణ హితమైన గణేశ్ విగ్రహాలు నెలకొల్పారు. వినూత్నంగా తయారుచేసిన విగ్రహాలూ ఏర్పాటు చేశారు. స్థానిక దిగుమర్తి వారి వీధిలో గాజులతో చేసిన వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తడంతో, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానిక జగన్నాథపురంలో జెమ్స్‌తో గణనాథుడిని అలంకరించారు. 16 అడుగుల జెమ్స్‌తో తయారుచేసిన విగ్రహాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్థానిక దేవదాయ శాఖ డీసీ కార్యాలయం ఆవరణలోని వినాయక ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో మట్టితో తయారుచేసిన గణేశ్ విగ్రహాన్ని నెలకొల్పారు. స్థానిక విద్యుత్‌నగర్ వినాయకుడి ఆలయంలో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్‌బీనగర్ వినాయకుడి ఆలయంలో స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. గాంధీనగర్‌లోని మంటపం, గాంధీనగర్ రైతు బజార్‌లో వినాయకుడి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు జరిగాయి. సాలిపేటలోని వినాయకుడి ఆలయంలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు.

ఘనంగా వేడుకలు

కరప: మండలంలో వివిధ గ్రామాల్లో వినాయక చతుర్థి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. కరప, వేళంగి, నడకుదురు గ్రామాల్లోని గణపతి ఆలయాల్లో, పలు గ్రామాల్లో మంటపాలు ఏర్పాటు చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేళంగి మార్కెట్ సెంటర్, నిత్యానందపురం సెంటర్లలో భారీగా మంటపాలు వేసి, విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. నవరాత్రుల సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు కమిటీవారు తెలిపారు. కరప మెరకవీధి రామాలయం వద్ద ఆరు అడుగుల మట్టి వినాయకుడికి పూజలు చేశారు. పాత వినాయక వీధిలో గణేశ్ విగ్రహానికి బాలభక్త బృందం పూజాదికాలు నిర్వహించింది. విద్యుద్దీపాలతో ఏర్పాటుచేసిన వినాయకుడి కటౌట్ ఆకట్టుకుంది. గురజనాపల్లిలోని శివాలయంలో మూడేళ్లుగా మట్టి విగ్రహాన్ని పెట్టి, పూజలు చేస్తున్నారు.

పూజలందుకుంటున్న గణనాథుడు

కాకినాడ రూరల్: ప్రథమ పూజలందుకునే గణనాథుడు మండపాల్లో కొలువయ్యాడు. వినాయక చవితి పండగను బుధవారం కాకినాడ రూరల్‌లో ఘనంగా జరుపుకొన్నారు. గ్రామాలతో పాటు, కాకినాడలో వీధి వీధినా వినాయక మండపాలు వెలిశాయి. వివిధ రూపాల్లో గణనాథుడు భక్తులకు దర్శనమిస్తున్నాడు. తొమ్మిది రోజుల పాటు గణపతి నవరాత్రుల అనంతరం నిమజ్జనాలు చేయనున్నారు. కాకినాడ రూరల్‌లోని గ్రామాల్లో చవితి సందడి ఆధ్యాత్మిక శోభను తెచ్చింది. మండపాల వద్ద విద్యుద్దీపాలంకరణ, భజనలు ఏర్పాటు చేశారు.



గురజనాపల్లిలో గణేశ్ మట్టి విగ్రహం



వేళంగి నిత్యానందపురం సెంటర్‌లో లైటింగ్



రమణయ్యపేటలో ఆపరేషన్ సిందూర్ పేరిట ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహం



కరప మెరకవీధిలో ఆరు అడుగుల గణేశ్ విగ్రహాన్ని దర్శించుకుంటున్న భక్తులు



వైద్యనగర్‌లోని మండపంలో కొలువైన గణనాథుడికి భక్తుల పూజలు

గణపతి పూజలో ఆరోగ్య ప్రయోజనాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జటావల్లభుల

బోట్‌క్లబ్: వేదాలు, పురాణాల్లో మూలికల ప్రస్తావన ఉందని, అలాగే గణపతి పూజలో వైద్య ఆరోగ్య ప్రయోజనాలున్నాయని ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు జటావల్లభుల లక్ష్మీనారాయణ శాస్త్రి అన్నారు. బుధవారం స్థానిక వేణుగోపాల సంస్కృత ప్రచార సభలో గణపతి నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. పండగల్లో ఆచరించే విధానం ఆరోగ్యంగా ఉండడానికేనన్నారు. చవితి నాడు గణపతి పూజకు ఉపయోగించే తులసి సహా, వివిధ రకాల పత్రుల వైద్య ప్రాముఖ్యాన్ని వివరించారు. సంస్కృత ప్రచార సభ అధ్యక్షుడు జీవీకే వర్మ మాట్లాడుతూ, సంస్కృత భాష, సంస్కృతీ సంప్రదాయాలు సంస్కార ఔన్నత్యాన్ని ఇస్తుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి పీఎస్ఎస్ కిరణ్, గౌరవాధ్యక్షుడు జీవీ కృష్ణంరాజు, ఉపాధ్యక్షుడు గంటి నాగేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి, కోశాధికారి చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.